
సాక్షి బాపట్ల

శుక్రవారం । 28 । జూలై । 2023



త్రికోటేశ్వర స్వామి సేవలో..

నరసరావుపేట రూరల్: కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామిని రాష్ట్ర కార్మిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ హరి జవహర్‌లాల్ నాయక్ గురువారం కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు.



23 టీఎంసీలకు పులిచింతల

అచ్చంపేట : పులిచింతల ప్రాజెక్టు నీటి నిల్వ గురువారం సాయంత్రానికి 23 టీఎంసీలకు చేరింది. 24 గంటల్లో 3 టీఎంసీలు పెరగడం గమనార్హం. నీటిమట్టం 157 అడుగులకు చేరింది.



ప్రకాశం బ్యారేజీకి పెరిగిన వరద

విజయవాడ : ప్రకాశం బ్యారేజీకి 1,78,850 క్యూసెక్కుల వరద వచ్చిచేరుతోంది. బ్యారేజీ వద్ద నీటి మట్టం 11.4 అడుగులకు చేరింది. గురువారం మధ్యాహ్నం వరకు 80 వేల క్యూసెక్కుల వరదతో నిలకడగా ఉంది.

న్యూస్‌రీల్

న్యాయవాది హత్య ?

బల్లికురవ: బల్లికురవ మండలం కొణిదెన గ్రామానికి చెందిన న్యాయవాది రాయసం విఠల్‌బాబు విజయవాడలో న్యాయవాదిగా పనిచేస్తుంటాడు. కొనిదెన గ్రామంలో తనకున్న పొలం విషయంలో అదే గ్రామానికి చెందిన తోటకూర కమల్‌బాబు, భూమి యజమాని విఠల్‌బాబు మధ్య కోర్టులో కేసు నడుస్తోంది. బుధవారం కోర్టు కేసు పనిమీద విఠల్‌బాబు అద్దంకి కోర్టుకు హాజరై తిరిగి ఇంటికి చేరక పోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. ఆయన ఫోన్ నంబరుకు ఫోన్‌చేయగా ఎత్తకపోవడంతో ఫోన్‌ను ట్రేస్ చేయించారు. ఈ క్రమంలో విఠల్‌బాబు ప్రత్యర్థి కమల్‌బాబు వద్ద ఫోన్ ఉన్నట్లు తెలుసుకుని అతన్ని నిలదీశారు. తానే విఠల్‌బాబును చంపేసి పూడ్చిపెట్టినట్లు పోలీసులు చెప్పడంతో అద్దంకి, బల్లికురవ పోలీసులు బొమ్మనంపాడు గ్రామ సమీపంలోని పొలాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

వినుకొండలో 144 సెక్షన్

వినుకొండ(నూజెండ్ల): వినుకొండలో మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, అతని అనుచరులు, టీడీపీ అల్లరిమూకలు ఎమ్మెల్యే బొల్లాబ్రహ్మనాయుడు వాహనంపై దాడి చేసిన నేపథ్యంలో పట్టణంలో 144 సెక్షన్ విధించారు. తహసీల్దార్ కిరణ్‌కుమార్ ఆదేశాల మేరకు పోలీసులు ఈనెల 27 నుంచి 30 వరకు 144 సెక్షన్ విధించినట్లు పోలీసులు తెలిపారు. ఈసందర్భంగా ర్యాలీలు, బహిరంగ సభలు నిషేధించినట్లు వెల్లడించారు.

యార్డులో 36,745 బస్తాల మిర్చి విక్రయం




కొరిటిపాడు(గుంటూరు) : గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 36,745 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 35,997 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.10 వేల నుంచి రూ.23 వేల వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాలకు మిర్చి సగటు ధర రూ.10 వేల నుంచి 26 వేల వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలు రూ.10 వేల నుంచి రూ.22 వేల వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.9,500 నుంచి 24,500 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5 వేల నుంచి రూ.14,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 9,132 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

ప్రియుడిపై సలసలకాగే నూనె



నకరికల్లు: నిద్రిస్తున్న ప్రియుడిపై ఓ మహిళ సలసల కాగే నూనెపోసి తీవ్రంగా గాయపరిచింది. ఈ ఘటన నకరికల్లులో బుధవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. నకరికల్లుకు చెందిన ఆతుకూరి నాగరాజు, జగన్నాథపు నాగమణి కొన్నాళ్లుగా సహజీవనం చేస్తున్నారు. నాగమణికి సంతానం కలిగే అవకాశం లేకపోవడంతో సంతానం కోసం నాగరాజు మరొకామెను పెళ్లి చేసుకోవాలని ఆలోచన చేస్తున్నట్లు నాగమణికి అనుమానం కలిగింది. ఈ విషయమై ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఈ నేపథ్యంలో ఈనెల 26న నాగరాజు ఇంట్లో నిద్రిస్తుండగా అతడిని చంపాలన్న ఉద్దేశంలో నూనెను బాగా కాగబెట్టి నాగరాజు ఒంటిపై పోసింది. దీంతో తీవ్రంగా గాయపడిన నాగరాజు కేకలు వేయడంతో స్థానికులు 108 సహాయంతో నరసరావుపేటలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాధితుడు ఇచ్చిన వాంగ్మూలం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్ఐ ఎ.బాలకృష్ణ గురువారం తెలిపారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 515.60 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడి కాలువకు 4,940, ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్‌కు 6,290 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 817.70 అడుగుల వద్ద ఉంది. జూరాల నుంచి శ్రీశైలం జలాశయానికి 70,422, హంద్రి నుంచి 1,125 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

హరిత యజ్ఞం

- నేడు గ్రీన్ బాపట్లకు శ్రీకారం
- జిల్లాలో ఒకేరోజు రెండు లక్షల మొక్కలు నాటే కార్యక్రమం
- జగనన్న పచ్చతోరణం పథకంలో భాగంగా అమలు
- కలెక్టరేట్‌లో గ్రీన్ బాపట్ల థీమ్ ఆవిష్కరణ



గ్రీన్ బాపట్లపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: అన్నిరంగాలతో పాటు పర్యాటకంగా దినదినాభివృద్ధి చెందుతున్న బాపట్ల జిల్లాను ఎవర్‌గ్రీన్‌గా మార్చేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. దీనిలో భాగంగా మహా హరిత యజ్ఞానికి శ్రీకారం చుట్టింది. దీనిని సాకారం చేసేందుకు కలెక్టర్ రంజిత్‌బాషా నేతృత్వంలో అధికారులు నడుం బిగించారు. ఈ నెల 28న జగనన్న పచ్చతోరణం కార్యక్రమం వేదికగా గ్రీన్ బాపట్లకు బాటలు వేసేందుకు సర్వం సిద్ధంచేశారు. శుక్రవారం ఒకేరోజు జిల్లా వ్యాప్తంగా 2 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. బాపట్ల రూరల్ పరిధిలోని వెదుళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో కలెక్టర్ రంజిత్‌బాషా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి, జాయింట్ కలెక్టర్ శ్రీధర్ పాల్గొంటారు. అనంతరం బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో మొక్కలు నాటుతారు. అక్కడి నుంచి కలెక్టర్ కార్యాలయంలో గ్రీన్ బాపట్ల థీమ్ బోర్డును ఆవిష్కరిస్తారు. ఆ తరువాత జిల్లా వ్యాప్తంగా ఎక్కడికక్కడ అన్ని ప్రభుత్వశాఖల అధికారులు, సిబ్బంది, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, డ్వాక్రా మహిళలు, ఎన్‌జీఓలు తమ పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాల్లో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొంటారు. మండల స్పెషల్ ఆఫీసర్లు తమ పరిధిలోని కార్యాలయాల వద్ద మొక్కలు నాటుతారు.



నేడు మొక్కలు నాటనున్న వెదుళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



గ్రీన్ బాపట్లపై అవగాహన కార్యక్రమంలో మానవహారంలా ఏర్పడిన అధికారులు, ప్రజలు

ఉద్యమంలా.. ముందుకు

ఇప్పటికే గ్రీన్ బాపట్లను విజయవంతం చేసేందుకు అధికారులు గత వారం నుంచి విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా ఎక్కడికక్కడ ర్యాలీలు, మానవహారాలు నిర్వహించారు. మొక్కలు నాటే కార్యక్రమంలో అన్నివర్గాల ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయులను, విద్యార్థులను భాగస్వాములను చేస్తున్నారు. ప్రధానంగా అన్ని పాఠశాలలు, కళాశాల్లో విద్యార్థుల చేతులమీదుగా మొక్కలు నాటించనున్నారు.

మొక్కలు సిద్ధం

చినగంజాం, వేటపాలెం, చీరాల, కొరిశపాడు ప్రాంతాల్లో డ్వామా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నర్సరీల నుంచి రెండు లక్షల మొక్కలు తీసుకువచ్చి సిద్ధం చేశారు. గుంతలు తీసి ఉంచారు. శుక్రవారం వేప, చింత, నేరేడు, మోదుగ, నల్లమద్ది, సుంకేసుల, కానుగ, గంగరావి, రావి, రేలా తదితర మొక్కలు నాటనున్నారు.

జయప్రదం చేయండి



అన్నిరంగాల్లో బాపట్ల జిల్లా అభివృద్ధి చెందుతోంది. పర్యాటకంగా మరింత ఆకర్షిస్తోంది. ఈ పరిస్థితులలో జిల్లాలో పచ్చదనం మరింతగా పెంచి గ్రీన్ బాపట్లగా మార్చాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం. అందుకోసమే జగనన్న పచ్చతోరణం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఒక్క రోజునే రెండు లక్షల మొక్కలు నాటేందుకు సిద్ధమయ్యాం. అందరూ ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి.

– రంజిత్‌భాషా, బాపట్ల జిల్లా కలెక్టర్

అందరూ భాగస్వాములు కావాలి



బాపట్ల జిల్లాలో పచ్చదనం పెంపునకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాం. శుక్రవారం ఒకేరోజు జిల్లా వ్యాప్తంగా 2 లక్షల మొక్కలు నాటుతున్నాం. ఈ మహాయజ్ఞంలో అందరూ భాగస్వాములు కావాలి. పర్యావరణ పరిరక్షణ మనందరి లక్ష్యం.

– శంకర్‌నాయక్, పీడీ డ్వామా, బాపట్ల జిల్లా

జనన్న సురక్షత పాలన

ఇది జనం మెచ్చిన 'సర్టిఫికెట్'

- నేటితో 'జగనన్న సురక్ష' ముగింపు
- 11 రకాల ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా అందజేత
- రాష్ట్రంలోనే బాపట్ల జిల్లాకు నాలుగో స్థానం
- సచివాలయాల వారీగా మొదటి నాలుగు స్థానాలు బాపట్ల జిల్లాకే..



సర్టిఫికెట్లు తీసుకున్న లబ్ధిదారులు

బాపట్ల అర్బన్: జిల్లాలో జగనన్న సురక్ష కార్యక్రమం శుక్రవారంతో దిగ్విజయంగా ముగియనుంది. ఈ కార్యక్రమ అమలులో బాపట్ల జిల్లా రాష్ట్రంలోనే నాలుగో స్థానాన్ని కైవసం చేసుకుంది. సచివాలయాల వారీగానూ మొదటి నాలుగు స్థానాలు దక్కించుకుంది. ఫలితంగా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇది సురక్షిత పాలన అని సర్వత్రా ప్రశంసిస్తున్నారు.

4,64,800 మందికి సేవలు

జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా 477 సచివాలయాల పరిధిలో సురక్ష గ్రామసభలు నిర్వహించారు. మొత్తం 4,64,800 మందికి 11 రకాల ప్రభుత్వ సేవలను అందజేశారు. ఈ కార్యక్రమ నిర్వహణ కోసం అధికారులు బృందాలుగా శ్రమించారు. తొలుత వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో ప్రతి ఇంటికీ వెళ్లి అవసరమైన సర్టిఫికెట్ల వివరాలు తెలుసుకుని ప్రజలతో దరఖాస్తు చేయించారు. వాటిని వారం రోజుల వ్యవధిలోనే అప్రూవల్ చేయించి ఒక బహిరంగ సభలో స్థానిక ప్రజాప్రతినిధుల ద్వారా అందించారు. మొత్తం 11 రకాల ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా అడిగి మరీ ఇవ్వడంతో అర్హులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

తొలి నాలుగు స్థానాలు పొందిన సచివాలయాలు ఇవే..

చీరాల రూరల్ మండలంలో తోటవారిపాలెం సచివాలయం మొత్తం 10,571 దరఖాస్తులకు ఇప్పటి వరకు 10559 పరిష్కరించి రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. కర్లపాలెం సచివాలయం 10,092 దరఖాస్తులకు ఇప్పటి వరకు 10,069 పరిష్కరించి ద్వితీయ స్థానంలోనూ, చీరాల రూరల్ మండలంలోని వాడరేవు–1 సచివాలయం 9,706 దరఖాస్తులకు 9,653 పరిష్కరించి తృతీయ స్థానంలోనూ నిలిచాయి. కావూరివారిపాలెం సచివాలయం 8,488 దరఖాస్తులకు 8,485 సేవలు అందించి నాలుగో స్థానంలో నిలిచింది.

ఇంటి వద్దకే సర్టిఫికెట్

జగనన్న సురక్ష ద్వారా క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి వారికి కావాల్సిన ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తులు తీసుకుంటున్నాం పూర్తిస్థాయిలో విచారించి వారి ఇంటి వద్దకే సర్టిఫికెట్ తీసుకెళ్లి అందిస్తున్నాం. ఫలితంగా మాకు క్షేత్రస్థాయిలో ఎలాంటి ఇబ్బందులు ఉండడం లేదు. ప్రజలూ సహకరిస్తున్నారు.

– దాసరి రాంబాబు, జిల్లా పంచాయతీ అధికారి

జగనన్న బాటలో నేను సైతం



మా గ్రామంలో 50 ఇళ్లకు సేవలు అందిస్తున్నా. గతంలో వివిధ ధ్రువీకరణ పత్రాల మంజూరుకు అనుమతులు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడేవారు. ఇప్పుడు జగనన్న సురక్ష ద్వారా 11 రకాల సర్టిఫికెట్లు వెంటనే అందిస్తున్నాం అర్జీదారులు కోరిన వెంటనే సర్వే నిర్వహించి పత్రాలు జారీ చేస్తున్నాం. ఇలాంటి కార్యక్రమంలో నేను సైతం భాగస్వామి కావడం సంతోషంగా ఉంది.

– కాంద్రు వాణి వలంటీర్ హైదరపేట, తూర్పు, బాపట్ల మండలం

గొప్ప విషయం



జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా జిల్లాలో 4,64,800 మందికి ధ్రువీకరణ పత్రాలను అందజేయడం ఎంతో సంతోషంగా ఉంది. రాష్ట్రంలో బాపట్ల జిల్లా నాలుగో స్థానం సాధించడం గొప్ప విషయం. ఈ కార్యక్రమంలో భాగస్వాములైన అందరికీ శుభాకాంక్షలు.

– లక్ష్మీశివజ్యోతి, జిల్లా రెవెన్యూ అధికారి

విదేశీ విద్యా దీవెన వరం

- అట్టహాసంగా నగదు జమ
- జిల్లాలో 12 మందికి ప్రయోజనం
- రూ.1.33 కోట్ల మేర లబ్ధి
- కలెక్టర్ రంజిత్‌బాషా

బాపట్ల: విదేశీ విద్యా దీవెన పథకం పేద విద్యార్థులకు వరమని కలెక్టర్ పి.రంజిత్ బాషా చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం నగదు జమ కార్యక్రమాన్ని బటన్ నొక్కి అట్టహాసంగా ప్రారంభిచారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్ పి.రంజిత్ బాషా, చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, శాసన మండలి సభ్యురాలు పోతుల సునీత, దేవాంగ కార్పొరేషన్ చైర్మన్ బి.సురేంద్ర, బీసీ కమిషన్ సభ్యులు ఎ.ముసలయ్యతోపాటు లబ్ధిదారులు వీక్షించారు. అనంతరం వీరు అర్హులైన విద్యార్థులకు చెక్కును అందించారు. కలెక్టర్ రంజిత్‌బాషా మాట్లాడుతూ పేద విద్యార్థుల ఉన్నత భవిష్యత్తుకు రాష్ట్ర ప్రభుత్వం బాటలు వేస్తోందని చెప్పారు. విద్యార్థులు గొప్పగా ఎదిగి బహుళజాతి కంపెనీలలో సీఈఓలుగా రాణించాలని, గొప్ప నాయకులు కావాలని ఆకాంక్షించారు. జిల్లాలో 12 మంది విద్యార్థులకు ఈ పథకం ద్వారా రూ.1.33 కోట్ల లబ్ధి కలుగుతుందని వివరించారు. చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టే సంక్షేమ కార్యక్రమాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నతశిఖరాలను అధిరోహించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారిణి జె.రాజదెబోరా, బీసీ సంక్షేమ శాఖ అధికారిణి కల్పన, ఎస్టీ సంక్షేమశాఖ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



చెక్కును లబ్ధిదారులకు అందిస్తున్న కలెక్టర్ బాషా, ఎమ్మెల్యే కరణం, ఎమ్మెల్సీ సునీత

పొలంలో ఆడుకుంటూ.. నీటి కుంటలో పడి

ఐదేళ్ల బాలుడి దుర్మరణం



మృతి చెందిన ఆదిత్య

అద్దంకి: బాబాయ్‌తో కలిసి సరదాగా పొలం వెళ్లిన బుడతడు ఆనందంతో కేరింతలు కొట్టాడు. తుళ్లుతూ.. ఆడుతూ కబుర్లు చెబుతూ సంతోషంగా గడిపాడు. ఇది చూసి మృత్యువుకు కన్నుకుట్టిందో ఏమో కుంట రూపంలో ఒక్కసారిగా దిగమింగింది. బాలుడి తల్లిదండ్రులకు పుత్రశోకం మిగిల్చింది. ఈ హృదయ విదారక ఘటన గురువారం మండలంలోని ధర్మవరం గ్రామంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన దేవరాల తరుణ్, ఆదిలక్ష్మి దంపతులకు ఒక కుమారుడు ఒక కుమార్తె ఉన్నారు. కుమారుడు దేవరాల ఆదిత్య (5) గ్రామంలోని ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో యూకేజీ చదువుతున్నాడు. రోజూ బడికి వెళ్తూ వస్తుంటాడు. గురువారం బాబాయ్ అమర్‌నాథ్ పొలం వెళ్తుంటే తామూ వస్తామని ఆదిత్య, అతని చెల్లి మారాం చేశారు. దీంతో అమర్‌నాథ్ ఇద్దరినీ తీసుకెళ్లాడు. అమర్‌నాథ్ మేత కోసుకుని ఆటోలో వేసుకునే పనిలో నిమగ్నమయ్యాడు. ఈలోగా ఆడుకోమని ఇద్దరికీ తన ఫోన్ ఇచ్చాడు. ఆదిత్య చెల్లి ఫోన్ చూస్తుండగా ఆదిత్య పొలంలో ఆడుకుంటూ అటూ ఇటూ తిరిగాడు. అక్కడ నీటికుంట అంచుకువెళ్లి ప్లాస్టిక్ పట్టాపై కాలు జారడంతో నీటిలో పడిపోయి మునిగిపోయాడు. పని పూర్తయిన తర్వాత అమర్‌నాథ్ ఆదిత్య ఏడని అతని చెల్లిని ప్రశ్నిస్తే అటువైపు వెళ్లాడని చెప్పింది. పొలమంతా వెతికినా కనపడలేదు. చివరకు కుంట వద్ద కాలు జారిన ఆనవాళ్లు కనిపించడంతో నీటి కుంటలో పడి ఉంటాడని అనుమానించి వెంటనే గ్రామంలోని వారిని పిలిచి కుంటలో వెతికించగా అప్పటికే బాలుడు మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. వంశోద్ధారకుడిని ఇలా నీటి కుంట బలి తీసుకోవడంతో ఆ కుంటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. వారిని ఓదార్చడం ఎవరి తరమూ కాలేదు.

టీడీపీ అరాచకంపై ఆగ్రహం

- ధ్వజమెత్తిన వైఎస్సార్ సీపీ నేతలు
- బొల్లాపై దాడిని ముక్తకంఠంతో ఖండన
- ఇక చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరిక
- ప్రజాకోర్టులో తేల్చుకుందామని సవాల్

వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుపై తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలు దాడికి పాల్పడడంపై వైఎస్సార్ సీపీ శ్రేణులు భగ్గుమన్నాయి. పల్నాడులో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకు ఆ పార్టీ పన్నిన కుట్రను తీవ్రంగా ఖండించాయి. శాంతియుత నిరసనలకు పిలుపునిచ్చాయి. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేలు టీడీపీ నేతల తీరుపై ధ్వజమెత్తారు. బొల్లాపై దాడిని ముక్తకంఠంతో నిరసించారు. ఇలాగే వ్యవహరిస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ప్రజాకోర్టులో టీడీపీకి భంగపాటు తప్పదని పునరుద్ఘాటించారు. – సాక్షి, నరసరావుపేట



ప్రభుత్వ విప్ పిఆర్కే

మాచర్ల: రాష్ట్రంలో నిత్యం ఏదో ఒక అలజడి సృష్టించి రాజకీయ ప్రయోజనం పొందేందుకు తెలుగుదేశం పార్టీ నీచరాజకీయాలకు పాల్పడుతోందని, అందులో భాగంగానే వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడిపై ఆ పార్టీ నేతలు దాడికి పాల్పడ్డారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి(పీఆర్కే) ధ్వజమెత్తారు. బొల్లాపై దాడిని ఖండిస్తూ పిన్నెల్లి 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ప్రతి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీకి పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేకే టీడీపీ శ్రేణులు శాంతి భద్రతలకు విఘాతం కలిగించేందుకు కుట్రపన్నుతున్నాయని విమర్శించారు. పార్టీ ఉనికి కాపాడుకోవటం కోసం ప్రశాంతంగా ఉన్న పల్నాడులో అలజడులు సృష్టించడం దుర్మార్గమని ధ్వజమెత్తారు. 2019లో ఈ ప్రాంతంలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ ఓడిపోవడంతో పూర్తిగా చచ్చిపోయిన టీడీపీ ఇప్పుడు దిక్కుతోచక అలజడులు సృష్టించేందుకు కుయుక్తులు పన్నుతోందని పిన్నెల్లి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎల్లో మీడియా సహకారంతో ప్రభుత్వంపై దుష్ప్రచారానికి పాల్పడుతోందని ధ్వజమెత్తారు. వినుకొండలో జీవీ ఆంజనేయులు టీడీపీ కార్యకర్తలను రెచ్చగొట్టి వైఎస్సార్ సీపీ శ్రేణులపై రాళ్ళు, రాడ్లతో దాడులు జరిపి పైశాచిక ఆనందాన్ని పొందారని దుయ్యబట్టారు. టీడీపీ అధినేత నారా చంద్రబాబు డైరెక్షన్‌లోనే పల్నాడులో క్షుద్ర రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి రాజకీయాల వల్ల టీడీపీ సాధించేదేమీ లేదని స్పష్టం చేశారు. ఈ నాలుగేళ్ళలో ప్రజల వద్దకు వెళ్లని టీడీపీ నేతలు కరోనా కాలంలో ప్రజలను ఆదుకున్నారా అని ప్రశ్నించారు.

ప్రతి నియోజకవర్గంలో అభివృద్ధి

ప్రతి నియోజకవర్గాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వేలకోట్లతో అభివృద్ధి చేస్తుంటే టీడీపీ నేతలు ఓర్వలేక కుట్రలకు పాల్పడుతున్నారని పిన్నెల్లి రామకృష్ణారెడ్డి విమర్శించారు. వినుకొండ ఎమ్మెల్యే బొల్లా ఎప్పుడూ అక్రమ సంపాదన కోసం పాకులాడలేదని స్పష్టం చేశారు. నిరాధార ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు.



వైద్యశాలలో చికిత్స పొందుతున్న వైఎస్సార్ సీపీ నాయకుడు భీమని అంకారావును పరామర్శిస్తున్న ఎమ్మెల్యేలు బొల్లా బ్రహ్మనాయుడు, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

ప్రజాస్వామ్యంలో దాడులు తగవు

- రెట్టింపు మెజారిటీతో ఎమ్మెల్యే బొల్లా గెలుపు ఖాయం
- వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని



వినుకొండ టౌన్ : ప్రజాస్వామ్యంలో నాయకులపై దాడులు తగవని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని పేర్కొన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొనేందుకు వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు బొల్లాపల్లి మండలం వెళ్తున్న క్రమంలో వినుకొండ ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు అడ్డుకుని దాడులకు పాల్పడడాన్ని మంత్రి ఖండించారు. ఎమ్మెల్యే బొల్లాకు మద్దతుగా నరసరావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డితో కలిసి ఆమె వినుకొండ పట్టణానికి గురువారం చేరుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్యే బొల్లాకు చెందిన ప్రైవేట్ స్థలంలోకి మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తన అనుచరులతో అక్రమంగా ప్రవేశించి, అక్కడ ఉన్న విలువైన వస్తువులను తీసుకువెళ్లడంతో, అక్కడ విధులు నిర్వహిస్తున్న వ్యక్తి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారని, ఈ విషయంపై దుష్ప్రచారం చేస్తూ టీడీపీ నేతలు అనుమతి లేకుండా నిరసన చేపట్టారని, ప్రభుత్వ కార్యక్రమానికి వెళ్తున్న ఎమ్మెల్యేపై 500 మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు దాడికి తెగబడ్డారని, ఇది సరికాదని మంత్రి ఖండించారు. జనరంజక పాలన అందిస్తున్న జగనన్న నాయకత్వంలో రానున్న ఎన్నికల్లో తిరిగి వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సహకారంతో గతంలో ఎన్నడూ లేని విధంగా వినుకొండ నియోజకవర్గ అభివృద్ధి జరిగిందని పేర్కొన్నారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ తన ఉనికి కోల్పోయిందని, తిరిగి తమ ప్రాభవాన్ని పెంచుకునేందుకు చంద్రబాబునాయుడు, ఆయన కుమారుడు లోకేష్ యత్నిస్తున్నారన్నారు. యువగళం పేరుతో లోకేష్ పాదయాత్ర చేస్తూ, స్థానిక నాయకులను రెచ్చగొట్టే ధోరణితో వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. టీడీపీ శ్రేణులను దాడులకు ప్రోత్సహించడంలో ఆంతర్యం ఏమిటో ఆ పార్టీ నాయకులు ఆత్మ విమర్శ చేసుకోవాలని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో దాడులు చేసే వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. ఈసారి బొల్లా రెట్టింపు మెజార్టీతో గెలుస్తారని మంత్రి చెప్పారు. నరసరావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే బొల్లాపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. గడిచిన 25 సంవత్సరాల నుంచి జరుగుతున్న క్వారీ తవ్వకాలపై నేడు జీవీ అసత్య ఆరోపణలు చేయడమేమిటని ప్రశ్నించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న వైఎస్సార్ సీపీ నాయకుడు భీమని అంకారావును పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

30న ఎన్‌జీవోల భేటీ

కారంచేడు: తెలంగాణాలోని హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈనెల 30వ తేదీన ఉదయం 9 గంటల నుంచి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల సమావేశం నిర్వహించనున్నట్లు ఏపీ ఎన్‌జీఓ సంఘం రాష్ట్ర ప్రతినిధి మున్నంగి నాగిరెడ్డి తెలిపారు. గురువారం ఆయన మండలంలోని యర్రం వారిపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో సంస్థల నిర్వహణ, నిధులు, విధులు వంటి విషయాలతో పాటు రక్తదాతలకు రూ.3 లక్షల విలువైన బీమా వంటి అంశాలపై చర్చలు, అవగాహనలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు

మా'స్టార్లు'గా మార్చేందుకు..

- దోహదపడిన హెచ్ఎంల నాయకత్వ శిక్షణ తరగతులు
- అత్యున్నత విద్యా ప్రమాణాలు నెలకొల్పేందుకే..

బాపట్ల అర్బన్ సమాజాన్ని సన్మార్గపు దారుల వెంట పరుగులు పెట్టించే మార్గదర్శికి మరింత ఆయువుని స్తోంది. అక్షరాన్ని అమ్మలపాదిలో నేర్పుగా కూర్చే గురువుకు మరిన్ని నాయకత్వపు అస్త్రాలు అందిస్తోంది. చదువులమ్మ బడిని సరస్వతి గుడిగా తీర్చిదిద్దే పంతుళ్లకు శిక్షణ నైవేద్యాన్ని వరంగా ప్రసాదిస్తోంది. విద్యార్థులకు భవిష్యత్‌ను తీర్చిదిద్దే విద్యా దేవాలయ నిర్వహణలో హెడ్మాస్టర్లకు దిశానిర్దేశమై నిలుస్తోంది రాష్ట్ర ప్రభుత్వం. కొద్ది రోజుల క్రితం రాష్ట్ర విద్యా శాఖ కమిషనర్ బాపట్ల జిల్లాలోని ఓ పాఠశాలను సందర్శించారు. ఆయన పాఠశాల ఆవరణలోకి అడుగుపెడుతుంటే..జిల్లా విద్యాశాఖాధికారుల నుంచి ఉపాధ్యాయుల వరకు ప్రతి ఒక్కరూ స్వాగతం పలుకుతున్నారు. కానీ కమిషనర్ చూపంతా పాఠశాల ఆవరణపైనే కేంద్రీకృతమైంది. నాడు–నేడుతో రూపురేఖలు మార్చుకుంటున్న పాఠశాల పురోగతిపైనే దృష్టి నిలిచింది. వెంటనే తరగతి గదిలో విద్యార్థుల కదలికలను ఆ చూపు నిశితంగా గమనించింది. పాఠాలు చెప్పే టీచర్ల విద్యా విధానాన్ని పసిగట్టింది. అనంతరం అక్కడ లోపాలను గుర్తించింది. పాఠశాల పరిశీలనలో తెలుసుకున్న విషయాలపై అక్కడ హెచ్ఎంతో చర్చించారు. విధుల్లో అలసత్వం వహించిన ఒక టీచర్‌పై సస్పెన్షన్ వేటు వేశారు. అనంతరం మరో పాఠశాల అక్కడా కొన్ని లోపాలు గుర్తించారు. మరో టీచర్‌కు పనిష్మెంట్ .. ఇలా వెళ్లి


శిక్షణ అనంతరం గ్రూపు ఫొటో (ఫైల్)

ప్రతి చోటా ఏదొక లోపాలు బయటపడడంతో విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో ప్రభుత్వం అత్యున్నత విద్యా ప్రమాణాలు నెలకొల్పేందుకు నిర్ణయం తీసుకుంది. అదే రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లోని హెచ్ఎంలకు నాయకత్వ శిక్షణ.

సమగ్రంగా.. సంపూర్ణంగా

బాపట్ల కలెక్టరేట్‌లోని విస్తర్ల కేంద్రంలో ఈనెల 23 నుంచి ఆరురోజులపాటు శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నారు. నెల్లూరు, ప్రకాశం, పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని సుమారు రెండు వందల మంది ప్రధానోపాధ్యాయులకు శిక్షణ తరగతులను రాష్ట్ర విద్యా శాఖ మంత్రి ప్రారంభించారు. తొలుత జట్టు బాగుండాలంటే నాయకుడు సమర్థుడై ఉండాలి. అందుకే పాఠశాల ప్రగతి పథంలో ముందుకు వెళ్లాలంటే ప్రధానోపాధ్యాయుడు సమగ్ర అవగాహనతో ఉండాలి. ఈ దృక్పథంతోనే పాఠశాలల నిర్వహణపై ప్రధానోపాధ్యాయులకు శిక్షణ ప్రారంభించారు.

కార్పొరేట్‌ను తలదన్నేలా..

ఎనిమిది నుంచి పదో తరగతి పిల్లలకు బైజూస్ ద్వారా క్లాసులు అందిస్తోంది. ప్రభుత్వ, కార్పొరేట్ పాఠశాలను తలదన్నేలా విద్యా విధానంలో మార్పులు తీసుకొస్తోంది. దీంతోపాటు నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేస్తోంది. మరో వైపు ప్రతి విద్యార్థి బడిబాట పట్టేందుకు అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, జగనన్న కానుక, గోరుముద్ద వంటి అనేక కార్యక్రమాలు అమలు చేస్తోంది. ఇంతలా విద్యా రంగంలో మార్పు కోసం ప్రభుత్వం కృషి చేస్తున్న సమయంలో.. నిర్వహణ లోపంతో విద్యా వ్యవస్థ గాడి తప్పకూడదనే సంకల్పంతో ప్రభుత్వం హెడ్మాస్టర్లకు శిక్షణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

ప్రతి అంశంపై క్షుణ్ణంగా..

బాహుబలి సినిమాలో నాయకుడిని తొలుత అంతమొందిస్తే.. సైన్యం కకావికలమవుతుందని చెబుతున్నారు. ఇదే సూత్రంపై నాయకుడు బలంగా ఉంటే అక్కడ సైన్యం కూడా సమర్థవంతంగా ఉంటుందనే లక్ష్యంతో హెడ్మాస్టర్లకు శిక్షణ ఇస్తున్నారు. పాఠశాలలో ప్రధానంగా హెడ్మాస్టర్లు.. నాడు–నేడు పనుల నిర్వహణ, తరగతుల కేటాయింపు, నిధుల వినియోగం, విద్యార్థుల హాజరు సామర్థ్యం పెంపుదల, మధ్యాహ్న భోజనం, విద్యార్థుల నైపుణ్యాల మదింపు, రికార్డుల నిర్వహణ వంటి అంశాలపై ప్రతి రోజూ దృష్టి సారించాల్సి ఉంటుంది. అయితే వీటి నిర్వహణలో సరైన అవగాహన లేకపోవడం వంటి కారణాలతో వెనుకబడుతున్నారు. ఇది పూర్తిగా వ్యవస్థపైనే ప్రభావం చూపుతుంది. ఈ నేపథ్యంలో విద్యా ప్రమాణాలు పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం శిక్షణ ప్రారంభించింది. ప్రస్తుతం బాపట్ల పట్టణంలో ఐదు జిల్లాల హెడ్మాస్టర్లకు కొన్ని రోజులపాటు శిక్షణ ఇస్తున్నారు.

ఈ శిక్షణ ప్రారంభంలోనూ, చివరలోనూ మదింపు చేస్తారు. అనంతరం మరొక బ్యాచ్‌కు శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ కోసం 12 మంది మాస్టర్ ట్రైనర్లను సిద్ధం చేశారు. వీరిని సమగ్ర శిక్షణ వారు పర్యవేక్షిస్తుంటారు. ఇది మంచి ఫలితాలు ఇస్తుందని హెడ్మాస్టర్లు ఆనందంగా చెబుతున్నారు.

మరింత పరిజ్ఞానం



ఇలాంటి వృత్యంతర శిక్షణ ద్వారా మన నాలెడ్జిని మరింతగా పెంచుకోవచ్చు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ముందుకు సాగేందుకు ఇలాంటి శిక్షణ చాలా అవసరం.

–జి.మాల్యాద్రి ప్రధానోపాధ్యాయులు, జెడ్పీ పాఠశాల, మాచవరం, కందుకూరు మండలం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా

మరింత బలాన్ని ఇస్తున్నాం



పాఠశాలలను శ్రేష్ఠత వైపు నడిపించడానికి, మా విద్యార్థులకు సాధ్యమైనంత ఉత్తమమైన విద్యను అంద చేసేందుకు అవసరమైన సాధనాలు వనరులను అందించడానికి నేను కట్టుబడి ఉన్నా. నాయకత్వం, అనేది విజయవంతమైన పాఠశాల నిర్వహణలో కీలకమైన భాగం. అలాగే వ్యూహాత్మక ఆలోచన ప్రతిభావవంతమైన కమ్యూనికేషన్ టీం బిల్డింగ్ సహా అనేక రకాల నైపుణ్యాలు అవసరం. అనేక విషయాలపై ఆచరణాత్మక మార్గదర్శకత్వం అందించడానికి రూపొందించబడింది ఈ నాయకత్వం.

–ఎ.శ్రీనివాసరావు స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సమగ్ర శిక్ష విజయవాడ ఆంధ్ర ప్రదేశ్

ఆచరణాత్మక మార్గదర్శకత్వం



పాఠశాలలకు అభివృద్ధి పరచడానికి, ఆచరణాత్మక మార్గదర్శకత్వం అందించడానికి రూపొందించబడింది ఈ నాయకత్వం. నాయకత్వ అభివృద్ధిపై పెట్టుబడి పెట్టడం వల్ల మా విద్యార్థులకు సానుకూలత పెంపొందించే అభ్యాస వాతావరణాన్ని సృష్టించవచ్చు. ఉద్దేశపూర్వకంగా ఉండడానికి వారిని శక్తివంతం చేయవచ్చు. అందుకే రాష్ట్రంలోని అందరు ప్రధానోపాధ్యాయులకు ఆ రోజుల శిక్షణ ఇవ్వడం జరుగుతుంది

బి.వి.ఎ.ఎల్. వరప్రసాద్, ప్రధానోపాధ్యాయులు, జెడ్పీ ఉన్నత పాఠశాల కండ్లగుంట, నకరికల్లు మండలం. పల్నాడు

ఆత్మ విశ్వాసం పెంపొందించింది



ఇతర జిల్లాల నుంచి వచ్చిన ప్రధానోపాధ్యాయుల సాహచర్యంలో ఎన్నో కొత్త విషయాలు శిక్షణలో పొందాం. ఈ శిక్షణ మాలో అంతులేని శక్తి సామర్థ్యాలు, ఆత్మ విశ్వాసం పెంపొందించింది. రిసోర్స్ పర్సన్లు చక్కగా విషయాల్ని చర్చా పద్ధతిలో వివరించారు. ఏర్పాట్లు చాలా చక్కగా ఉన్నాయి. మెరుగైన వసతి సౌకర్యాలు, చక్కటి భోజనం ఏర్పాటు చేసినందుకు సమగ్ర శిక్షా వారికి నా అభినందనలు.

–ఎం.జయకుమార్, ప్రధానోపాధ్యాయులు, జెడ్పీ ఉన్నత పాఠశాల, పడమటి నాయుడు పాలెం, కురిచేడు మండలం, ప్రకాశం జిల్లా

పాఠశాల నాయకులుగా వ్యవహరిస్తూ ..



ఆవాస ప్రాంతంలోని అన్ని విద్యా సంబంధ అంశాలకు నాయకత్వం వహిస్తాం. ఆ ఆవాసప్రాంత విద్యాభివృద్ధికి సంబంధించి బాధ్యతలు తీసుకొంటాం. అవసరమైన బృందాలను ఏర్పరచుకొని విద్యానాయకత్వం వహిస్తాం. సమాజ భాగస్వామ్యంతో పాఠశాల అభివృద్ధికి కృషిచేస్తాం. వృత్తిపర అభివృద్ధికి నిరంతర విద్యార్థిగా అధ్యయనం చేస్తాం. వ్యక్తిగత నైపుణ్యాలను పెంపొందించుకొని వృత్తిపర సమస్యలను, ఒత్తిడిని అధిగమించి స్వీయ అభివృద్ధితో పాఠశాల అభివృద్ధికి బాటలు వేస్తాం.

– కె.వి.రమేష్, ప్రధానోపాధ్యాయులు, ప్రాజ్ఞం, నిజాంపట్నం మండలం, బాపట్ల జిల్లా

వ్యక్తిగత పరిశుభ్రతతోనే పర్యావరణ పరిరక్షణ

సెంట్రల్ టీం పీఓ మోహన్


వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న సెంట్రల్ టీం

స్వర్ణ (కారంచేడు): గ్రామాల్లో పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు, పరిసరాల పరిశుభ్రతను మెరుగుపరచాలని సెంట్రల్ టీం ప్రోగ్రాం ఆఫీసర్ ఏ మోహన్ పేర్కొన్నారు. గురువారం ఆయన మండలంలోని స్వర్ణ గ్రామ తనిఖీ నిమిత్తం వచ్చారు. గ్రామంలో జరుగుతున్న అన్ని రకాల పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. పంచాయతీ కార్యాలయం, పీహెచ్‌సీ, సచివాలయం, హైస్కూల్, చెత్తసేకరణ కేంద్రం, చెత్త నుంచి సంపద ఉత్పత్తి కేంద్రాలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించి సిబ్బందికి అవసరమైన సూచనలు చేశారు. స్వచ్ఛ సర్వేక్షణ్ 2023లో భాగంగా ఆయన కొడవలివారిపాలెం గ్రామాన్ని సందర్శించి గ్రామస్తులతో మాట్లాడారు. బహిరంగ మల, మూత్ర విసర్జనలతో అనేకమైన సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మోటాని మధుసూదనరావు, ఈఓపీఆర్డీ ఆర్ రమేష్‌బాబు, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ షాలినీ, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, సెంట్రల్ టీం సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

రేపు సత్తెనపల్లిలో ఫుట్‌బాల్ ఎంపికలు

సత్తెనపల్లి: ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆదేశాల మేరకు ఈనెల 29న సత్తెనపల్లి సుగాలీకాలనీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అండర్–14 సబ్ జూనియర్స్ బాలబాలికల పల్నాడు జిల్లాస్థాయి లీగ్ చాంపియన్‌షిప్ కమ్ సెలెక్షన్స్ జరుగుతాయని పల్నాడు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జోస్ పీటర్, కార్యదర్శి సుబ్రమణ్యం పేర్కొన్నారు. ఎంపికైన పల్నాడు జిల్లా అండర్–14 సబ్ జూనియర్ బాలబాలికల ఫుట్‌బాల్ జట్టు ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ నిర్వహించే జోనల్ స్థాయి టోర్నమెంట్‌లో పాల్గొంటారని తెలిపారు. పల్నాడు జిల్లాలో 2010–11లో పుట్టిన బాలబాలికలు 97010 52588కు కాల్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

కానిస్టేబుల్ కుమార్తెకు కాన్పూర్ ఐఐటీ సీటు

ప్రకాశం ఎస్పీ చేతుల మీదుగా పురస్కారం


అనుపమను అభినందిస్తున్న ఎస్పీ మల్లికా గర్గ్

మార్టూరు: మార్టూరు పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న పూర్ణాంజనేయరాజు చిన్న కుమార్తె అనుపమ ప్రతిష్ఠాత్మక కాన్పూర్ ఐఐటీలో ఇంజినీరింగ్ సీటు సాధించింది. ఈ సందర్భంగా కానిస్టేబుల్ కుటుంబాన్ని ప్రకాశం జిల్లా ఎస్పీ మల్లికా గర్గ్ గురువారం తమ కార్యాలయానికి పిలిపించుకొని అనుపమను శాలువాతో సత్కరించి రూ.10 వేలు నగదు పురస్కారం బహుమతిగా అందించారు. ప్రస్తుతం కాన్పూర్ ఐఐటీ కళాశాలలో మూడో ఏడాది ఇంజినీరింగ్ చదువుతున్న కానిస్టేబుల్ పూర్ణాంజనేయరాజు పెద్ద కుమార్తె జాహ్నవి గతంలో ర్యాంకు సాధించిన సందర్భంగా ఎస్పీ మల్లికా గర్గ్ రూ.25 వేలు నగదు పురస్కారం అందించి అభినందించినట్లు కానిస్టేబుల్ గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ భార్య సునీత కుమార్తెలు జాహ్నవి, అనుపమ పాల్గొన్నారు. కానిస్టేబుల్ రాజు జే పంగులూరు మండలం కొండమంజులూరు గ్రామానికి చెందిన వారు.

ఇన్‌స్పైర్ చేయించే ప్రాజెక్టులను రూపొందించాలి

జిల్లా విద్యాశాఖాధికారి పి. శైలజ


ఏపీ గ్రీన్ కార్ప్స్ లైఫ్‌స్టైల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఈవో శైలజ

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల్ని ఇన్‌స్పైర్ చేయించే ప్రాజెక్టుల్ని రూపొందించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి పి. శైలజ పేర్కొన్నారు. పాత బస్టాండ్ సెంటర్లోని జిల్లా పరీక్షా భవన్‌లో గురువారం ఇన్‌స్పైర్ మానక్ విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహణపై గుంటూరు, తెనాలి డివిజన్లకు చెందిన సైన్స్ ఉపాధ్యాయులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో శైలజ మాట్లాడుతూ గుంటూరు జిల్లాకు చెందిన విద్యార్థులు జాతీయస్థాయిలో ప్రతిభ చాటే విధంగా వినూత్న ఆలోచనలతో ప్రాజెక్టుల్ని తయారు చేసే విధంగా ప్రోత్సహించాలని సూచించారు. గుంటూరు డీవైఈవో పి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ఖర్చుతో అందజేసిన ట్యాబులు, పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఐఎఫ్ ప్యానెల్స్‌ను సమర్థంగా వినియోగించాలని తెలిపారు. కార్యక్రమంలో ముందుగా మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పించారు. అనంతరం ఏపీ గ్రీన్ కార్ప్స్ లైఫ్ స్టైల్ ఎన్విరాన్‌మెంట్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీసీఈబీ కార్యదర్శి లలితా ప్రసాద్, సభ్యుడు ఎ. తిరుమలేష్, జిల్లా సైన్సు అధికారి ఏ. రవికుమార్, ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసీం, ఎన్‌జీసీ సమన్వయకర్త వి.రామాంజనేయులు, డాక్టర్ సాంబశివరావు, పి. మల్లికార్జునరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ

తెనాలి: భారీ వర్షాల కారణంగా ప్రకాశం బ్యారేజీ నుంచి వరద నీరు దిగువకు విడుదల చేస్తున్న దృష్ట్యా దిగువన గల పల్లపు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెనాలి సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మ ఒక ప్రకటనలో తెలియజేశారు. భారీ వర్షాలకు కృష్ణా నది క్యాచ్‌మెంట్ ఏరియాలోంచి వరద నీరు బ్యారేజీకి ఉధృతంగా వచ్చి చేరుతోందని, గురువారం రాత్రి ఏడు గంటల సమయానికి 1,51,205 క్యూసెక్కులు వచ్చినట్లు తెలిపారు. ఈ ప్రవాహం 1.80 లక్షల క్యూసెక్కులు లేదా అంతకుమించి పెరిగే అవకాశం కూడా ఉందన్నారు. దీంతో ప్రకాశం బ్యారేజీ వద్ద 11.7 అడుగులకు నీరు చేరడంతో 55 గేట్లను మూడు అడుగుల ఎత్తుకు, 15 గేట్లను నాలుగు అడుగుల ఎత్తుకు తెరిచి దిగువకు 1,44,742 క్యూసెక్కులు వదులుతున్నట్టు రివర్ కన్జర్వేటర్/ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ప్రకటించినట్టు వివరించారు. వరద నీటి ప్రవాహం పెరిగే కొద్దీ దిగువకు విడుదల చేసే నీటి పరిమాణం కూడా పెరుగుతుందని గుర్తుచేశారు. బ్యారేజీ దిగువన లంక గ్రామాల ప్రజలు నదీ మార్గంలో రాకపోకలు చేయొద్దని, పశువుల్ని నదిలోకి దింపవద్దని గీతాంజలి శర్మ సూచించారు. తెనాలి డివిజనులో గురువారం ఉదయానికి నమోదైన వర్షపాతం వివరాల్ని ఆమె తెలియజేశారు. చేబ్రోలు 30.4 మి.మీ, దుగ్గిరాల 55.8, కాకుమాను 19.6, కొల్లిపర 50.4, మంగళగిరి 49.8, పొన్నూరు 15.6, తాడేపల్లి 55.6 తెనాలి 44.6 మి.మీ వర్షం కురిసిందన్నారు. మొత్తం 321.8 మి.మీ. కాగా, సగటు వర్షపాతం 40.2 మి.మీ. ఉందని వివరించారు.

జిల్లాలో 31 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

బాపట్ల: జిల్లాలో గురువారం విస్తారంగా వర్షాలు కురిశాయి. అత్యధిక వర్షపాతం భట్టిప్రోలులో 31 మిల్లీమీటర్లు నమోదు కాగా అత్యల్పంగా 2.8 మీ.మీ నమోదైంది. జిల్లా వ్యాప్తంగా చూస్తే టి.చుండూరు మండలంలో 19.6మీ.మీ, అమర్తలూరులో 22 మీ.మీ, వేమూరు 15.4 మీ.మీ,కొల్లూరులో 7.2, భట్టిప్రోలులో 31, చెరుకుపల్లిలో 17.4, పిట్టలవానిపాలెంలో 22.2, కర్లపాలెంలో 16.6, బాపట్లలో 12.6, నిజాంపట్నంలో 15.2, నగరంలో 18.6,రేపల్లెలో 18.4, సంతమాగులూరులో 8.4, బల్లికురవలో 12.2, మార్టూరులో 12.2, ఎద్దనపూడిలో 13.2, పర్చూరులో 16.2, కారంచేడులో 13.4, ఇంకొల్లులో 11, పంగులూరులో 15.4, అద్దంకిలో 22.6, కొరిశపాడులో 14.8, చీరాలలో 15.2, వేటపాలెంలో 12.8, చినగంజాంలో 16.2 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది.

వ్యవసాయ ఆధారిత పరిశ్రమలకు ప్రోత్సాహం

ఎస్‌బీఐ ఆర్ఎం రామ్‌కుమార్


డ్వాక్రా మహిళలకు చెక్కు పంపిణీ చేస్తున్న ఎస్‌బీఐ ఆర్ఎం రామ్‌కుమార్, అధికారులు

కారెంపూడి: వ్యవసాయ అనుబంధ పరిశ్రమల స్థాపనకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అత్యధిక ప్రోత్సాహం అందించనున్నట్లు ఆ బ్యాంక్ నరసరావుపేట రీజినల్ మేనేజర్ (ఆర్ఎం) డి రామ్ కుమార్ చెప్పారు. మండలంలోని చింతపల్లి గ్రామంలో గురువారం రాత్రి జరిగిన గ్రామ రైతుల రాత్రి శిబిరంలో ఆర్ఎం రామ్‌కుమార్ పాల్గొన్నారు. నరసరావుపేట రీజియన్‌లోని 42 బ్యాంకుల పరిధిలోని డ్వాక్రా సంఘాలకు గురువారం ఒక్కరోజే రూ.25 కోట్ల రుణాలిచ్చినట్లు ఆర్ఎం తెలిపారు. ఆ గ్రామంలో ఉన్న డ్వాక్రా సంఘాలకు రుణాలను ఆయన పంపిణీ చేశారు. ఎస్‌బీఐ వ్యవసాయ వాణిజ్య శాఖ బ్యాంకుల నుంచి అందించే రుణ సేవల గురించి రైతులకు వివరించారు. వ్యవసాయ ఆధారిత ఆహార పరిశ్రమల స్థాపనకు, అలాగే చిరుధాన్యాలు, పండ్లు, చేపలు, డెయిరీ ఇతర వ్యవసాయ ఆధారిత ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనకు రుణాలు అందించి అభివృద్ధిలో పాలుపంచుకోడానికి బ్యాంకు సిద్ధంగా ఉందని ఆర్ఎం రామ్‌కుమార్ స్పష్టం చేశారు. రైతులకు కొత్త పంట రుణాలు, అలాగే ట్రాక్టర్లు, హార్వెస్టర్లు ఇతర వ్యవసాయ యంత్ర పరికరాలకు రుణాలు అందిస్తామని రైతులు బ్యాంకు సేవలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో చీఫ్ మేనేజర్ క్రెడిట్ సీహెచ్‌బీవీ రాము, సీఎం సేల్స్ ఎం.బాలాజీ, కారెంపూడి బ్యాంక్ చీఫ్ మేనేజర్ కె.ఏడుకొండలు, బ్యాంకు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి ఆర్థిక సహాయం


వీరాంజనేయులు భార్య సునీతకు ప్రభుత్వ ఉత్తర్వుల కాపీని అందజేస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

ఎర్రబాలెం(క్రోసూరు):మండలంలోని ఎర్రబాలెం గ్రామానికి చెందిన రైతు వీరాంజనేయులు అప్పుల భారంతో గత మార్చి నెలలో ఆత్మహత్య చేసుకోగా ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయం రూ.7 లక్షలను ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మృతుడి కుటుంబానికి గురువారం అందచేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యవసాయంలో అప్పులు పెరిగిపోయి అప్పులు చెల్లించలేని పరిస్థితిలో ఏపూరి వీరాంజనేయులు ఆత్మహత్య చేసుకున్నాడని తెలిసి తనను తీవ్రంగా బాధించిందన్నారు. ఆత్మహత్య చేసుకున్న రైతులకు ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయాన్ని మంజూరు చేయించామన్నారు. మృతుడి భార్య సునీతకు ఆర్థిక సహాయం రూ.7 లక్షల మంజూరు ఉత్తర్వులు అందచేశామని, ఆర్థిక సహాయం ఆమె ఖాతాకు జమ కాబడిందన్నారు. రైతులకు విత్తనం నుంచి విక్రయం వరకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. మృతుడి భార్య సునీత, ఆమె కుటుంబ సభ్యులు మాట్లాడుతూ తమ కుటుంబాన్ని ఆదుకున్న ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెలది అప్పారావు, ఎంపీటీసీ గల్లా గురుపాదం, ఏఎంసీ చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, ఆదం షఫి, గ్రామంలోని వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.